# ఆత్మజ్ఞాన విచారణయే సనాతన ధర్మము

ఖండఖండాంతర ఖ్యాతినార్జించిన
మహనీయులనుగన్న మాతృభూమి
పాశ్చాత్యవీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గొన్న సమరభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి జూపిన దివ్యభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపినయట్టి భరతభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు జననమంది
భరతమాత ధర్మ భాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె భక్తులారా!

ప్రేమస్వరూపులారా!

భరతదేశంబు ఆరంజిపండు పోల్చ
కనగ జాతులు మతములు తొనలు కాదె
భిన్నతెగలు వృత్తులు అవి ఎన్నివున్న
భరతదేశాన పుట్టుటె భాగ్యమగును
ఐకమత్యంబు జ్ఞానంబు నందజేయు
దివ్యజ్యోతిని వెలిగించు దేశమిదియె

పవిత్రమైన భారతదేశము అనాదికాలమునుండియు ఆస్తిక్యాన్ని ప్రబోధిస్తూ ప్రచారముచేస్తూ, ఆచరణను అందిస్తూ వచ్చింది. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు', అన్నదే హైందవ సాంప్రదాయముయొక్క లక్ష్యము. ఇట్టి పవిత్ర భారతదేశమునందు జన్మించిన

sri sathyasai vachanamrutam

భారతీయులయొక్క సుకృతము, అదృష్టము యెంతయో కొనియాడదగినది.

**అజ్ఞానమును తొలగించగలిగిన దివ్యఔషధము ఆత్మజ్ఞానము ఒక్కటే!**

'సహస్రశీర్షాః పురుషః సహస్రాక్ష సహస్రపాత్'. అన్ని శిరస్సులు, అన్ని నేత్రములు, అన్ని పాదములు భగవంతుని అంగములే! విశ్వమే విష్ణు స్వరూపము. ప్రతి పదార్థమునందు అస్థి, భాతి, ప్రియ, నామ, రూపములనే ఐదు తత్త్వములుకూడి వున్నవి. సత్‌చిత్ ఆనందములే మానవునియొక్క నిజస్వరూపములు. నామరూపములు కల్పితములు. నిజముగా మానవునియొక్క స్వభావము చాలా విచిత్రమైనది, నిర్మలమైనది, నిస్వార్థమైనది. కానీ, ప్రాకృత దోషములు కొంత వుండటంచేత మానవత్వములో కొంతవరకు మాలిన్యము యేర్పడుతూవచ్చింది. మానవునియందు ఆవిర్భవించిన యీ సత్ చిత్ ఆనందముయొక్క తత్త్వాన్ని ప్రతివ్యక్తి గురించటం అత్యవసరము. మానవుని ఆవరించిన అజ్ఞానము కేవలము మాటలతో పోవునది కాదు. ఎంత సంపద కల్గినప్పటికిని, ఎన్ని వున్నతమైన అధికారములు చేబట్టినప్పటికి, ఎంత విద్యావంతుడైనప్పటికిని, మనస్సునందు ఆవరించిన యీ అజ్ఞానమును యేమాత్రము తొలగించలేవు. ఈ అజ్ఞానరోగమును తొలగించే దివ్య ఔషధము ఆత్మజ్ఞానము ఒక్కటి మాత్రమే.

**సుఖ, దుఃఖములనేవి వచ్చిపోయే బంధువులవంటివి మాత్రమే**

ప్రేమస్వరూపులారా! మానవునకు లభించే సంతోషముగానీ, ఆనందముగానీ, సుఖముగానీ, ఐశ్వర్యముగానీ వీటిని చూచి మనము మురిసిపోరాదు. ఇది కేవలము రావటమేకాదు, పోవటముకూడా జరుగుచున్నది. ఈ సుఖదుఃఖములనేవి వచ్చిపోయే బంధువులవంటివి మాత్రమే! కనుక, మానవత్వములో వుండిన దివ్యత్వాన్ని విస్మరించక, క్షణికమైన లౌకిక భోగభాగ్యములకు లొంగక, తనయొక్క స్వరూపమును తాను గుర్తించుకొనుటకై తగిన ప్రయత్నము చేయాలి. మానవుని దేహము నీటి బుడగవంటిది. దీనిని ఆశ్రయించి మాత్రము మనము జీవించరాదు. సుఖమునకు ఎట్టి వికారమో, దుఃఖమునకుకూడా అట్టి వికారమే! సుఖదుఃఖములు రెండుకూడను వికారములతోకూడినవే! ఇట్టి వికార స్వరూపములైన భావములను ఆవరించి, వరించి, సత్యమైన స్వభావమును

మరచటం మానవునియొక్క స్వభావము కానేరదు. ఆత్మ నిత్యమైనది. దేశకాలములకు అతీతమైనది. ఆత్మజ్ఞాన విచారణయే సనాతన ధర్మము. ఇట్టి ఆత్మజ్ఞాన విచారణా స్వరూపమైన సనాతన ధర్మమును అనుసరించుటయే జీవునియొక్క ధర్మము. ఈ దేహముయొక్క తత్వము అంతమయ్యేది.

**మలినపుకొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుల పొదిలెమ్ము జూడ మనమెప్పుదలంప దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే**

పంచభూతములు పాంచభౌతిక దేహమునే బాధించవచ్చును గానీ, అతీతమైన ఆత్మతత్త్వాన్ని యివి యేమాత్రముకూడను కదలించలేవు.

**శరీరము, మనస్సు, ఆత్మలయొక్క కూడికయే మానవత్వము**

మానవుడు అనగా విశ్వాసముకలిగినవాడు. విశ్వసించతగినది మానవత్వము. పవిత్రమైనది మానవత్వము. జీవించతగినది మానవత్వము. లక్ష్యమును వీడక మానవత్వమును సార్థకము గావించుకోటమే తనయొక్క కర్తవ్యము. శరీరము, మనస్సు, ఆత్మలయొక్క కూడికయే మానవత్వము. ఈ మూడు మానవుని స్వభావమును నిరూపించుచున్నవి. మానవత్వాన్ని ఉన్నతస్థితికి గొనిపోవుచున్నవి. వీటినే చేయుట, తెలుసుకొనుట, వుండుట అని దీనికొక అర్థము. చేయుట అనగా 'శరీరమాద్యం ఖలు దర్మసాధకం'. ఈ శరీరముచేతనే మానవుడు అన్ని ధర్మకర్మలు ఆచరించుచూ వచ్చుచున్నాడు. దేహమే లేకుండిన ఎట్టి ధర్మకర్మలు ఆచరించుటకు వీలుకాదు. సమస్త కర్మలు ఆచరించటానికి అనుకూలమైన కరణము, యీ దేహము.

ఇక రెండవది, మనస్సు. 'సంకల్పవికల్పాత్మకం మనః'. నిరంతరముకూడను మనస్సు సంకల్పవికల్పములచేతనే కూడివుంటున్నది. 'మనోమూల మిదంజగత్'. జగత్తంతయుకూడను మనోమయముగానే వుంటున్నది. మనస్సులేని పదార్థముగానీ, వ్యక్తిగానీ, విషయముగానీ యిందులో కానరాదు. మంచి, చెడ్డల విచారణకూడను

srisathyasaivachanamrutam

మనసుద్వారానే జరుగుచున్నది. నిత్యానిత్యవిషయ పరిశీలనకూడను మనసువల్లనే జరుగుచున్నది. కనుకనే మనసు అనగా తెలుసుకొనుట అనికూడను దీనికొక అర్థము.

ఇక, ఆత్మ. ఇది నిత్యమై, సత్యమై, నిర్మలమై, నిస్వార్థమై జ్యోతిర్మయమైన స్వరూపము. ఇది ఎట్టి మార్పు చెందునది కాదు. ఇది మానవుని అంతరాత్మయందు పరంజ్యోతిగా వెలుగుచున్నది. దానినే దైవత్వమనికూడను పిలుచుచున్నవి, శాస్త్రములు. భారతీయుల పవిత్రమైన శాస్త్రములు, చరిత్రములు యీ అంతరాత్మను గురించి ప్రబోధించటమే జరుగుతూ వస్తున్నది. భగవంతుడు ఆత్మస్వరూపుడనికూడను శాస్త్రములు బోధిస్తూ వచ్చినవి. హృదయము పవిత్రమైనప్పుడే దైవత్వమును పొందుటకు సాధ్యమవుతుందని బైబిలు వర్ణిస్తూ వచ్చింది. పవిత్రకార్యములు ఆచరించి హృదయము నిర్మలమైనస్థితిలో వుంచుకోటమే దివ్యత్వమైన దైవత్వమని మహమ్మదీయుల ఖురాను బోధిస్తూవచ్చింది. సద్భావములచేతను, సత్కర్మలచేతను, సత్ప్రవర్తనల చేతను మానవత్వమును నిరూపించటము, అందుకు హృదయమే ప్రధానమని చెప్పి గురునానక్ బోధిస్తూ వచ్చాడు. ఏతావాతా సర్వమతములయొక్క సారము, సర్వమార్గములయొక్క గమ్యము హృదయముయొక్క పవిత్రతయేనని నిరూపింపబడినది. కనుక ప్రేమ, సత్యము అనేవి దేహమునకు సంబంధించినవి కాదు, హృదయమునకు సంబంధించినవి.

మానవుడు నిజముగా ఆత్మస్వరూపుడే! అయితే తనయొక్క యిట్టి స్వరూపాన్ని మరచిపోయి క్షణికమైన, క్షుద్రమైన, లౌకికమైన యీ భోగభాగ్యములకు మురిసిపోయి భగవంతుని మరచిపోతున్నాడు. ఈ లౌకిక సుఖములను ఆశించి వాటి నిమిత్తమై అనేక ప్రయత్నములు చేస్తున్నాడు, మానవుడు. కడకు తన ప్రయత్నములు ఫలించక, సాధించినదానిని పూర్తిగా అనుభవించలేక నిరాశచే, నిస్పృహతో జీవితాన్ని గడపుతున్నాడు. నూటికి తొంభైమంతులు మానవులు నిర్విరామకృషిచే, నిరంతర తాపత్రయములతో, అంతులేని ఆశలతో, అర్థములేని ఆవేదనలతో అప్రాప్యరూపప్రాప్తికై ప్రాకులాడుచు తుదకు అశాంతిని అందుకుంటున్నారు. ఇంతటితో తమయొక్క ప్రయత్నమును విరమించుటలేదు. మానవుడు తనయందుండిన మానవత్వాన్ని, దైవత్వాన్ని మరచిపోతున్నాడు. దానవత్వాన్ని

srisathyasaivachanamrutam

పెంపొందింపచేసుకుంటున్నాడు. ఫలితంగా చివరకు తనకుతాను పతనమగుటయేకాక తోటి మానవునికూడను పతనము గావించుచున్నాడు. ఇందుకు మూలకారణము ధర్మబద్ధమైన, నియమబద్ధమైన జీవితమును అలక్ష్యము చేయటమే!

**ఏకాత్మ భావమును పొందటమే నిజమైన ధర్మము**

ధర్మము అన్నింటికిని మూలమైనది. ధర్మమే గొప్ప సుగుణము. ధర్మమనగా కేవలము మానవుడు నిత్యజీవితములో తమ తమ కర్తవ్యములను గుర్తించుకోటము, ఆచరించటము మాత్రమే కాదు. అనేకమంది ధర్మమనగా నీతికి పర్యాయపదముగా భావిస్తున్నారు. ఇది నిజమైన ధర్మము కానేరదు. మానవునియందు ఆవిర్భవించిన చైతన్యమును ఏకంగా సత్యపరముగా పట్టి వుంచటమే నిజమైన ధర్మము. మానవునియొక్క చైతన్యతత్త్వమును అహంకారభావముచే, అహంకారసూత్రముచే కట్టినప్పుడే యిది త్రిగుణ స్వరూపమైన ధర్మంగా యేర్పడుతుంది. సృష్టి చైతన్యమునే ఈశ్వరబద్ధముగా మనము భావించినప్పుడు యిదియే నిజమైన ఆత్మధర్మముగా రూపొందుతుంది. ఏకాత్మభావమును పొందటమే నిజమైన ధర్మము. బాహ్యమైన, లౌకికమైన యీ జగత్ సంబంధమైన కర్తవ్యములన్నికూడను కేవలము త్రిగుణస్వరూపములైన ధర్మములే! స్వధర్మము అనే పదమునందు. 'స్వ' అనగా ఆత్మధర్మమే! పరధర్మమనగా దేహ ధర్మమే! దేహధర్మములు అనిత్యములు, మార్పులతో కూడినవి. యుగయుగములందుకూడను యిట్టి మార్పులు జరుగుతూనే వస్తున్నవి. కానీ, యిట్టి ధర్మములు ఆత్మధర్మములుగా మనము విశ్వసించరాదు. గృహస్థధర్మములు, ఆశ్రమధర్మములు, వర్ణధర్మములు ఇలా అనేకరకములుగా వుంటున్నాయి. ఇవి కేవలము మానవునియొక్క జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవి మాత్రమే! జీవిత పరమావధి సంబంధమైన ఆత్మతత్త్వాన్ని, ఆత్మధర్మాన్ని మనము అనుసరించాలి. కేవలము దేహధర్మము మాత్రమే అనుసరించటముచేత మనము మృగములుగా తయారవుతున్నాము. ఇంక మనోధర్మమును ఆచరించినప్పుడు తాత్కాలికమైన మానవత్వముగా నిరూపిస్తూ వస్తున్నది. శారీరక మానసికములు రెండూకూడి ఆత్మతో అనుబంధము చేసుకున్నప్పుడే యిది దైవత్వాన్ని పొందింపజేస్తుంది.

sri sathyasai vachanamrutam

దేహము చేయుట, మనస్సు ఆలోచించుట, ఆత్మ సాక్షీ భూతమై వుండుట ఈ మూడింటియొక్క కర్తవ్యములు వివిధములుగా వుండినప్పటికిని, యివి వేరు వేరు మార్గములలో ప్రవర్తించినప్పటికిని, అన్నింటికిని అన్యోన్య ఆశ్రయమనేది ఒకటున్నది. ఈ మూడు అవినాభావసంబంధము అయినప్పుడే మానవత్వము సార్ధకము గావించుకోవచ్చు. ఈ మూడింటియొక్క యేకత్వమే పూర్ణత్వమనే మార్గముననుసరింపజేస్తుంది.

ధర్మార్ధకామమోక్షములు, చతుర్విధ పురుషార్ధములు. ధర్మముతోనే అర్ధము నాశించాలి. అర్ధకామములు రెండును ధర్మము నాశ్రయించినప్పుడే సార్ధకమవుతాయి. ధర్మమును విసర్జించి, అర్ధకామములకు మాత్రమే అఱ్ఱులు చాచినప్పుడు జీవితము అశాంతికి గురౌతుంది. అర్ధకామములు ధర్మమునాశ్రయించినప్పుడు మోక్షము మనకు సహజసిద్ధముగా లభిస్తుంది. మోహక్షయమే మోక్షమనే సులభ మార్గాన్ని మనము అనుసరించవచ్చు. మానవత్వమనేది నూతనముగా యేర్పడినదికాదు. 'మా' అనగా 'కాదు'. 'నవ' అంటే 'క్రొత్తది'. 'మానవ' అంటే యిది క్రొత్తదికాదు అని దీని అర్ధము. ఎన్నో జన్మలనుంచి వచ్చేది, పాతది. ఎంతకాలమైననూ మానవత్వాన్ని పాతగానే రోతగానే అనుభవిస్తుంటే నిజమైన స్వరూపాన్ని మనము ఎప్పుడు అనుభవించేది? కనుకనే సర్వము బ్రహ్మమయమనే సత్యమును మనము నిరూపించాలి. సమాజములోనే సర్వస్వరూపమైన ఈశ్వరత్వాన్ని ఆవిర్భవింపజేసుకోవాలి. అదే 'ఈశావాస్య మిదంసర్వం'.

**చుక్కలన్నియు బ్రహ్మ సూర్యుండది బ్రహ్మ**
**చంద్రుడన్నను బ్రహ్మ జలము బ్రహ్మ**
**స్వర్గమన్నను బ్రహ్మ వైకుంఠమది బ్రహ్మ**
**తల్లి అన్నను బ్రహ్మ తండ్రి బ్రహ్మ**
**సంపదంతయు బ్రహ్మ వాల్లభ్యమది బ్రహ్మ**
**జీవరాసులు బ్రహ్మ జీవి బ్రహ్మ**
**పుట్టించుటది బ్రహ్మ పోషించుటది బ్రహ్మ**
**గిట్టించుటది బ్రహ్మ గృహిణి బ్రహ్మ**

sri sathyasaivachanamrutam

**కాలమంతయు బ్రహ్మ కాయంబు అది బ్రహ్మ**
**ప్రకృతంతయు బ్రహ్మ ప్రాణంబు బ్రహ్మ**
**సర్వమును బ్రహ్మ మరియు యీ సభయు బ్రహ్మ**
**సత్యమును దెల్పు యీ సాయి బ్రహ్మ**

సర్వమును బ్రహ్మమయమే! బ్రహ్మకు వేరైన పదార్థము మరొకటిలేదు. సర్వము బ్రహ్మమయముగా వుండినప్పుడు మనము వెతుకుట యెక్కడ, తాను చిక్కుట ఎక్కడ?

**విశ్వవిభుడే నీ హృదయేశ్వరుడు**

'విశ్వమంతా ప్రాణ విభుని మందిరమైన వీధివాకిలి యెక్కడ?' విశ్వమంతా మందిరమైనప్పుడు వీధికి యింకెక్కడ స్థానముంది? వీధియే లేనప్పుడు యింక దీనికి వాకిలి ఎందుకు? విశ్వవిభుడే నీ హృదయేశ్వరుడు. వీణ తంత్రులు మీటి ప్రాణతంత్రులు కదిలించి ఆనంద బాష్పములతో ఆత్మార్పణము చేయ, అదియే వైకుంఠము. అదియే దైవత్వము. భగవంతునియొక్క సంపదలుగానీ, భగవంతునియొక్క ఐశ్వర్యముగానీ మనకు అనుకూలమార్గమున అందిస్తూవచ్చాడు. ఆ ఐశ్వర్యమునకు వారసులే మీరందరు. అయితే ఆ ఐశ్వర్యమేమిటో మీరు గుర్తించటానికి ప్రయత్నించాలి.

**సాయికున్నట్టి ఐశ్వర్య సంపదలకు**
**సాటి ఐశ్యర్యమున్నదెచ్చోటనైన**
**సాయి ఐశ్యర్యమేమన్న స్వార్థరహిత**
**నిత్య నిర్మల ప్రేమయే నిజము నిజము**

సాయియొక్క ఐశ్వర్యములు, యీ భవనములు, యీ మందిరములు, యివికాదు. సాయియొక్క ఐశ్వర్యములు నిస్వార్థమైన, నిర్మలమైన పవిత్రమైన ప్రేమ ఒక్కటి మాత్రమే! ఆ ప్రేమకు మీరు వారసులై, ఆ ప్రేమను మీరు అనుభవించి, ఆ ప్రేమను మీరు అందుకొని, ఆ ప్రేమను మీరు సరైన రీతిగా జగత్తుకు చాటటమే మీ ప్రధాన కర్తవ్యము. సర్వవ్యాపియైన, సర్వజ్ఞుడైన, సర్వశక్తిమయుడైన భగవంతునికి మీరు అర్పితము చేసేది ఏమిటున్నది? కేవలము భ్రాంతి మాత్రమే! మీ మానసిక తృప్తికై మీరు యిన్ని విధములైన అర్పితములు

sri sathyasai vachanamrutam

గావిస్తూవస్తున్నారు.

**బ్రహ్మాండమంతట ప్రబలుచుండెడి తనకు**
**ఆలయమునమర్చ అలవియగున**
**కోటిసూర్యులకాంతి మేటి గల్గిన తనకు**
**ప్రమిద దీపము నెవరు పట్టగలరు**
**అజహరాదులకైన అందనివాడు**
**తనరూపు కనుగొన నెవరి తరము**
**సర్వజీవులయందు సంచరించెడి తనకు**
**సరైన బేరిడ సాధ్యమగున**
**బ్రహ్మాండమంతయు బొజ్జలోనుండగ**
**భక్ష్య భోజ్యంబు తనకు పెట్టతగున**

కేవలము మానవ జీవితముయొక్క ధన్యతకోసమై యీ విధమైన మార్గమును అనుసరిస్తూ వస్తున్నారేగాని, నిజముగా భగవంతునికి ఒక స్థానము, ఒక పేరు, ఒక రూపము అన్నది యెక్కడా కానరాదు.

**ప్రేమస్వరూపుడైన భగవంతుని ప్రేమద్వారానే గుర్తించుటకు ప్రయత్నించాలి**

భగవంతుని యే రూపనామములచేత ఆరాధింతురో ఆ రూపనామములలోనే భగవంతుని గుర్తించటానికి వీలవుతుంది. భగవంతుడు కల్పవృక్షము, కామధేనువు. ఆర్తుడు, అర్థార్థి, జిజ్ఞాసువు, జ్ఞాని ఎవరెవరు తమస్థాయికి తగినట్లుగా ఏ విధముగా తనను ప్రార్థించెదరో భగవంతుడు వారిని ఆ విధముగా అనుగ్రహిస్తున్నాడు. ప్రేమస్వరూపులారా! భగవంతుని సులభముగా పొందుటకు ఒక్క ప్రేమ మాత్రమే ప్రధానమార్గము. ప్రకాశించే చంద్రుని చూడవలెనంటే చంద్రుని కాంతిచేతనే చూడవచ్చుగానీ అందుకు ఏ పెట్రోమాక్సులైటో, ఏ టార్చిలైటో, ఏ హరికెన్‌లైటో అవసరములేదు. భగవంతుడు ప్రేమస్వరూపుడు కనుక, ఆ ప్రేమద్వారానే భగవంతుని గుర్తించుటకు ప్రయత్నించాలి.

**ఇంద్రియములను నిగ్రహించినవాడే నిజమైన విజయమును సాధించినవాడు**

sri sathyasai vachanamrutam

కనుక, ప్రేమనే మనయొక్క ప్రాణముగా విశ్వసించాలి. మానవునినుండి మొట్టమొదట ఆవిర్భవించేది ఒక్క ప్రేమమాత్రమే! తదుపరియే అన్ని గుణములుకూడను ఆవిర్భవిస్తున్నవి. కనుక, మనవి ప్రేమరహితములైన హృదయములుగా వుండకూడదు. మనం ప్రేమమయమైన జీవితాన్ని గడపాలి. మానవునియొక్క భావములు అనేక విధములైన రాగములచేత కూడివుంటాయి. రాగద్వేషములే మానవునకు రాహుకేతువులు. ఒకానొక సందర్భములో శంకరులవారి శిష్యులలో తోటకుడనేవాడు ప్రశ్నిస్తాడు. 'గురుదేవా! జగత్తులో దిగ్విజయమును సాధించినవాడు ఎవడు!' అని. కేవలము రాజ్యములు సాధించినవాడు విజయుడా? కానేరడు. హిమాలయ పర్వతమునెక్కి అక్కడ ఒక flag ను పెట్టి తాను ఒక వీరుడనని అనిపించుకోటం, యిది ఒక వీరత్వముకాదు. సముద్రమును యీదగల్గినవాడు విజయాన్ని సాధించినవాడు కానేరడు. ఆటపాటలయందు విజయమును సాధించినవాడు విజయుడు కానేరడు. హిరణ్యకశిపుడు సముద్రమునందు దిగి దానిని పరిశోధించినవాడు. మిన్నును మన్ను, మన్నును మిన్నుకూడను చేయగలిగినవాడు. కానీ, అట్టివాడుకూడను విజయాన్ని సాధించలేక పోయాడు. నిజమైన విజయుడెవ్వరు? ఇంద్రియములను నిగ్రహించినవాడే నిజమైన విజయుడు. అయితే, బాలుడైన ప్రహ్లాదుడు యింత విజయమును సాధించిన హిరణ్యకశిపుని ఒక ప్రశ్నవేశాడు.

**లోకములన్నియున్ ఘడియలోన జయించినవాడవు**
**యింద్రియానీకము చిత్తమున్ గెలువనేరవు**

'తండ్రీ! క్షుద్రమైన, క్షణికమైన యీ రాజ్యమును నీవు సాధించటానికి, జయించటానికి ప్రయత్నిస్తున్నావు. యుద్ధములో చేరి అడవులలో మృగములలాగ మానవులను చంపినంత మాత్రమున వీరుడు కానేరడు. నీ యందున్న మృగమును నీవు సంహరించటానికి తగిన కృషి చేయమ'న్నాడు. 'నీ దుర్గుణములనే యింద్రియములను నీవు మొట్టమొదట జయించమ'న్నాడు.

**లోని శత్రువులకు లొంగిపోయినవాడు**
**బయటి రిపులనెట్లు పట్టగలడు?**

srisathyasaivachanamrutam

లోపలి శత్రువులకే లొంగిపోయినవాడు బయటి శత్రువులపై యేరీతిగా తాను విజయము సాధించగలడు? ఇది అసాధ్యము. లోని శత్రువులను సంహరించాలంటే, లోని శత్రువులను జయించాలంటే, ఒక్క ప్రేమ అనే అస్త్రము మాత్రమే సరైన అస్త్రము. కనుక, ప్రేమచేతనే మనయొక్క జీవితము సార్థకము గావించుకొని, ప్రేమచేతనే మనకు అడ్డుతగిలే అరిషడ్వర్గములను జయించుకొని దివ్యమైన దైవత్వమును పొందటానికి తగిన కృషి చేయటము అత్యవసరము.

**ఈశ్వర పితృత్వము, సర్వ మానవ సోదరత్వము, ఈ రెండింటిని మనము సాధించాలి**

'మనుజ' అనగా మనుచక్రవర్తి సంతతివారు అని అర్థము. అతనియొక్క సంతతివారమైన మనము అతనియొక్క ఆస్తినే పొందటానికి కృషి చెయ్యాలి. అతని న్యాయము, ధర్మము, సత్యము, ప్రేమ, సహనము, సానుభూతులనే గుణములను అనుసరించినప్పుడే మనము అతని సంపదకు వారసులు అవటానికి అధికారము వుంటుంది. ప్రేమస్వరూపులారా! అందరూ భగవంతుని బిడ్డలే! రూపనామములందుగానీ, వేషభాషలయందుగానీ వేరువేరు మార్గములు అనుసరించినప్పటికిని అందరికి ఒక్క ప్రభువు మాత్రమే వున్నాడు. తండ్రి ఒక్కడే! కనుకనే brotherhood of man and fatherhood of God యీ రెండింటిని మనము సాధించాలి. ఈనాడు లోకములో అనేక విధములైన అశాంతులచేత, అక్రమములచేత, అనాచారములచేత, అధర్మములచేత మానవుడు కుళ్లి, కృశించి, కృంగిపోవుచున్నాడు. ఇలాంటి పరిస్థితులయందు మానవులు భగవద్విశ్వాసమును అభివృద్ధి గావించుకొని, మానవత్వాన్ని సార్థకము గావించుకొనే నిమిత్తమై ప్రేమాస్త్రములను చేతబట్టి సమాజమునందు ప్రవేశించి, సేవకావృత్తియందు మీ జీవితమును సార్థకము గావించుకోవాలని నేను ఆశిస్తున్నాను. కేవలము దేహమునే ఆశ్రయించకండి. మనస్సునుకూడను మీరు ఆశ్రయించకండి. దేహ, మనస్సులయొక్క తత్త్వముచేత ఆత్మను ఆశ్రయించండి. ఆత్మను ఆశ్రయించినవాడే ధన్యుడు కాగలడు. అదియే యీనాడు మనము చేయవలసినది. జరుపవలసినది, సేవలు. ఈ సేవకావృత్తిలోపల జీవితాన్ని సార్థకము చేసుకోవాలి.

sri sathyasai vachanamrutam

## సేవద్వారానే ఆత్మార్పణ జరుగుతుంది

నవవిధ మార్గములలో ప్రాణసమానమైనది, మధ్యస్థాయిలో వుండినది, సేవ. ఈ సేవద్వారానే ఆత్మార్పితము జరుగుతుంది. ఈ ఆత్మార్పితము జరిగినప్పుడే స్నేహము ప్రారంభమవుతుంది. ఈ స్నేహముచేతనే ఐక్యత చిక్కుతుంది.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

సర్వమానవులయందు ప్రకాశించే పరతత్త్వము ఆత్మతత్త్వమని విశ్వసించండి. ఎవరిని మీరు గౌరవించినప్పటికిని, ఎవరికి మీరు నమస్కరించినప్పటికిని యిది దైవమునకు చెందుతుందనే భావాన్ని మీరు విశ్వసించాలి. ఇదియే భారతీయతత్త్వ శాస్త్రమందు 'సర్వజీవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' అన్నారు. అదే విధముగనే 'సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి'. ఎవరిని మనము తిరస్కరించినప్పటికిని అదికూడను కేశవునికే చేరుతుందన్నారు. కనుక, వ్యక్తిగతమైన అభిప్రాయ భేదములు, ద్వేషములు ఎన్ని వుండినప్పటికిని ఆత్మతత్త్వమును మాత్రము ఏకత్వముగా భావించాలి.

**(తేదీ 23-11-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam